

# బతికానురా తండ్రీ కుమారస్వామీ

'ఇంక రొంత ముక్కితే ఇంక రొన్ని మార్కులు వచ్చుండేవి గదరా ముండా' అన్నాడు మా మీసాల సుబ్బరాజయివోరు నా ఏడో కిలాసు మార్కుల లిస్టుని నా చేతిలో పెడతా.

ఆనేక మా నాయన వంక చూస్తా 'ఇదిగో కరీంభాయ్. వీడు చూడ్డానికి యిట్టా అవుపిస్తున్నాడా? కరెంటు చీమ. ఈ పక్క కంటితో చూసింది ఆ పక్క కంటితో పట్టేస్తాడు. ఆడా యీడా చేర్పించకుండా రొంత మంచి హైస్కూల్లో చేర్పించినావంటే కడుపులో నాలుగు అక్షరమ్ముక్కలు వేసుకొని బతికిపోతాడు' అన్నాడు ఆయన చేతిలో నా టీసీ పెడతా.

మా నాయన దాన్ని తీసుకొని ముందుకీ ఎనక్కీ తిప్పి 'అట్టే సార్' అన్నాడు.

నా వంక చూసి 'ఇవ్వరా. పోదాం' అన్నట్టుగా సైగ చేశాడు.

అప్పటి దాకా నేను నా జేబులో బద్రంగా పెట్టుకొని ఉన్న కొత్త హీరో పేనాని దాని

మీదున్న కవరుతో సహా మీసాల సుబ్బరాజయివోరి చేతిలో పెడతా 'ఇదిగోండి సార్. తీసుకోండి. బడి నుంచి పోతా ఉన్నాను గదా మీకు ఏదో ఒకటి యిద్దామని మా నాయనతో చెబితే ఇది కొనిచ్చినాడు. తీసుకోండి సార్' అన్నాను.

దానిని చేతిలోకి తీసుకోంగానే మా మీసాల సుబ్బరాజయివోరు ఎట్నో అయిపోయి నాడు. చిన్నప్పటి నుంచి మనం ఆయన ఇస్కూల్లో ఆయన కళ్ల ముందరే పెరిగినాము. పైగా ఆయన 'కరీం కొడకా.. కరీం కొడకా' అని పిలస్తా ఉంటే 'ఎస్సార్.. వస్తున్నా సార్' అని పలకతా ఉన్నాము, అదంతా గుర్తుకు వచ్చిందో ఏమో కళ్లు ఒకలాగా అయినాయి.

అది బైటికి కనబడనీకుండా మాతో పాటు బయటదాకా నడిచి నేను మెట్లు దిగతా ఉంటే 'బాగా చదువుకొని మన ఇస్కూలు పేరు నిలబెట్టాలిరోయ్' అని మీసాల నిండుగా నవ్వతా నా తల మీద నిమిరాడు.

మళ్లొక్కసారి ఎళ్లొస్తామని చెప్పి, నేనూ మా నాయనా మా యిద్యానికేతన్ నుంచి బయటపడినాము.

దారి పొడుగూతా నేను మా నాయన వేలు పట్టుకొని నడస్తా ఉన్నానేగానీ ఆయన నాతో ఒక్క మాట కూడా మాట్లాడలా. ఏమాలోచిస్తున్నాడో ఏమో అనుకొని సైగ్గా నా మార్కుల లిస్టు వైపు చూసుకున్నాను.

ఒక్క హిందీలో తప్ప తక్కినవాటన్నిటిలో నలబైకి యాభైకి మద్యన ఉన్నాయి మార్కులు. హిందీలో అరవైమూడు. హీనం లెక్కలు. ముప్పయి అయిదు.

గమ్మ్మగా మడిచి జాగ్రత్తగా మళ్లా జేబులో పెట్టేసుకున్నాను.

'అయ్యిందా పనా?' అంది మా అమ్మ యింటికి పోవడంతోటే.

'అయ్యింది. మార్కులు కూడా రాసిచ్చినాడు. నేను చూళ్లా. నువ్వు చూడు. నాకు చెప్పబాక' అన్నాడు మా నాయన ముకం ఒకలాగ పెట్టి మంచం మీద కూర్చుంటా.

'ఏదిరా. యిద్దే' అని తీసుకొని చూసింది మా అమ్మ.

కాసేపు అట్టే ఆ మార్కుల తట్టే చూసి, 'పర్వేట్కి పోరా పర్వేట్కి పోరా అంటే ఇన్నావా? ఇప్పుడు చూడు' అంది తుస్కారంగా.

నేనేం మాట్లాడలా. రెండు నెల్లు పర్వేట్కి పంపించి మూడో నెల్లో డబ్బులు కట్టలే మని మాన్పించిన యిళ్లతో ఏం మాట్లాడతాం?

'యింకీడికి జెడ్పీ ఇస్కూలే గతి. ఆడతప్ప ఇంకేడా ఈడికి సీటు ఇయ్యరు. రేపు పోయి బర్తీ చేసేస్తాను' అన్నాడు మా నాయన.

ఆ మాటతో నాకు చురుక్కుమంది.

'ఆ ఇస్కూల్లో మాత్రం దేనికా? రేప్పొద్దున్నించి నేనుగూడా స్క్రూడైవరూ కటింగ్ ప్లేరూ పట్టుకొని నీతోపాటుగా పనికొస్తా. అన్నకెట్టా నేర్పిస్తున్నావు. నాక్కూడా నేర్పిస్తే యిద్దరం నీకు తోడుగా ఉంటాం' అన్నాను కోపంగా.

అంతటితో కోపం తగ్గక, మా అమ్మ 'ఒరే ఒరే' అంటా ఉన్నా అక్కణ్ణుంచి బయటికొ చ్చేశాను.

వచ్చి, పోలేరమ్మబండకాడ యాపచెట్టు నీడలో తలకాయొంచుకొని కూచున్నాను.

ఒక పక్క ఏడుపొస్తా ఉంది. ఇంకో పక్క జెడ్‌పి అనంటేనే బయమేస్తా ఉంది. ఆ ఇస్కూల్లో చేరిన పిలకాయలు చదువుసంగతి ఎట్టున్నా బిళ్లంగోడు ఆటలో జెమాజెట్టీల వుతారని పేరు. బ్రిటీషోళ్ల హయాములో కట్టిన కచ్చేరీని ఇస్కూలుగా మార్చి 'జిల్లాపరి షత్ బాయిస్ హైస్కూలు' చేశారుగానీ అది బలే అన్యాలమైన ఇస్కూలు. తలుపులూ కిటి కీలూ ఊడిపోయి పిలకాయలు ఎప్పుడు కావాలంటే అప్పుడు బయటకు దూకి ఇళ్లకు పోతా ఉంటారు. మా అన్న అందులో చదివే కరెంటుపనోడైనాడు.

ఇప్పుడు నేను కూడా అట్టా తయారవడం కంటే నీళ్లు లేని బావిలో దబీమని దూకడం మేలనిపించింది. ఆ పని చేద్దామా లేక యింటి నుంచి పారిపోయి సినిమాల్లోలాగా పెద్దయి తిరిగొద్దామా అని అనుకుంటా ఉండగా మా అమ్మ ఎతుక్కుంటా వచ్చి నా పక్కన కూచుంది.

'ఒరే. ఆ మనిషి కోపంలో ఉండి అట్టా అన్నాడుగానీ నిన్ను ఇశ్వోదయలో చేర్పించ మని చెప్పానులేరా. పలావెంకారెడ్డిని సలహా అడిగితే మార్గం తెలుస్తుందని కూడా చెప్పా. దా అన్నానికి' అని చేయి పట్టుకుని లేపింది.

ఇశ్వోదయ అనంటే మా కావలిలో టాపంటే టాపు ఇస్కూలు. నెంబర్‌ఒన్ అన్నమాట. ఆ ఇస్కూల్లో చదవినోడెవ్వడూ చెడిపోడని పేరు. పదోకిలాసులో ఆ ఇస్కూల్లో పాసై నంతమంది మా హోల్ నెల్లూరుజిల్లా మొత్తంలో ఇంకో ఇస్కూలు నుంచి పాస్‌గారు. అందుకని ప్రతి సంవచ్చరం దాని పేరు పేపర్లలో పడతా ఉంటుంది. అయితే ఆడ ఎవరు పోతే వాళ్లని జెడ్‌పి ఇస్కూల్లోలాగా కళ్లకద్దుకొని చేర్పించుకోరు. మార్కులు ఉంటేనే సీటు. లాకుంటే లా.

మా నాయన ఏ కళన ఉన్నాడో ఏమో అన్నం తినగానే బజారుకి వెళ్లి పలావెంకారెడ్డి దగ్గర సలహా అడిగి వచ్చాడు.

'ఆ ఇస్కూలు హెడ్మాస్టరు కుమారస్వామి ఐవోరుగదా. ఆయన నీకు తెలుసుగదా. జనతాపేట ఒకటో నెంబరు యీదిలో ఉంటాడు. సాయంత్రం పిల్లోణ్ణి తీసుకొని నేరుగా ఇంటికి వెళ్లి మాట్లాడు. ఏదో ఒక దోవన నాలుగు మాటలు మాట్లాడి మెప్పించినావంటే సీటు ఇస్తాడు' అని చెప్పినాడంట పలావెంకారెడ్డి.

అంతటితో ఆగక, 'సాయంత్రం అనగానే మరీ సాయంత్రమే పోబాక. ఇస్కూలు నుంచి వచ్చి ఇష్షుబుష్షు అంటా ఉంటాడు. కోపం మనిషి. ఏడూ ఏడున్నర అయ్యేసరికి స్నానం గీనం చేసి కాఫీ గీఫీ తాగి స్తిమితంగా ఉంటాడు. అప్పుడు పో' అని కూడా చెప్పా డంట.

వచ్చి ఆ సంగతి మా అమ్మతో చెప్పాడు మా నాయన.

'ఇంకేమీ. ఆ పని చెయ్యి. ఎట్టా పొద్దున్నే గుడ్డలు గూడా ఉతికున్నాను. సాయంత్రా నికి ఆరతాయి. అబ్బాకొడుకులు కాస్త శుద్దంగా కట్టుకొని పోండి' అంది మా అమ్మ.

సాయంత్రం ఏడూ ఏడున్నరకంతా నా చెయ్యి పట్టుకొని, జనతాపేటలో ఉన్న కుమార స్వామి ఐవోరి ఇంటికి తీసుకొనిపోయాడు మా నాయన.

పలావెంకారెడ్డి చెప్పినట్టుగానే ఆయన అప్పుడే స్నానం గీనం చేసి కాఫీ గీఫీ తాగి

తెల్లటి ఫుల్ బనీను, పంచె కట్టుకొని స్తిమితంగా సోఫాలో కూచుని ఉన్నాడు.

మా నాయనను చూడ్డంతోటే 'ఏం కరీం' అన్నాడు వరండాలోకి వస్తా.

'మా వాడు సార్' అని నా వైపు చూపిస్తా, మొహమాటంగా నవ్వాడు మా నాయన.

నేను బయం బయంగా బక్తి బక్తిగా ఆయన తట్టే చూస్తా నమస్కారం చేశాను.

'సీటా?' అన్నాడు ఆయన.

'అవును సార్. మా యిళ్లల్లో ఈడికే సార్ నాలుగు అక్షరమ్ముక్కలు వచ్చింది. జెడ్పిలో చేర్పిస్తే నాశినం అయిపోతాడని మీకాడికి తీసుకొని వచ్చాను. మీరే ఎట్టో చేయాలి సార్' అన్నాడు మా నాయన ఎంతో జాలిగా మొఖం పెట్టి.

మా నాయనట్టా మాట్లాడతా ఉంటే నా మనసు ఎట్టెట్టో అయిపోయింది.

'అదేంది కరీంభాయ్. నువ్వు గదా మా ఇస్కూలుకి కరెంటు పని చేసింది. నువ్వు చేసిన కష్టానికి నీ బిడ్డకు సీటు యివ్వకుండా ఉంటానా? దీనికి ఇంటిదాకా రావాలా వెర్రాయనా' అని 'ఏదిరా. నీ మార్కుల లిస్టు' అని అడిగాడు నన్ను.

చేయి వణకతా ఉంటే జేబులో నుంచి తీసిచ్చినాను. నల్లటి పెద్దఫ్రేము కళ్లద్దాలు పెట్టుకొని, దాని వంకే కాసేపు చూసి 'ఊ' అన్నాడాయన.

'నువ్వు చదివింది యిద్యానికేతన్‌గదా. ఇంగ్లీషులో అడుగుతాను చెప్పు' అని 'వాటీజ్ యువర్ నేమ్?' అన్నాడు.

ఈ కొసెను మనకు చిన్నప్పటి నుంచి అలవాటు గదా.

'మై నేమ్ ఈజ్ ఎండి.ఖదీర్‌బాబు' అని టకీ మని చెప్పేశాను.

వెంటనే ఆయన 'వాటీజ్ యువర్ ఫాదర్' అన్నాడు.

నేను వెంటనే 'మై ఫాదర్స్ నేమ్ ఈజ్ కరీం' అన్నాను.

ఆయన ఆపి 'నోనోనో... అయామ్ నాట్ ఆస్కింగ్ యు యువర్ ఫాదర్స్ నేమ్. మై క్వశ్చన్ ఈజ్ వాటీజ్ యువర్ ఫాదర్?' అన్నాడు.

అంత ఇంగ్లీషు వినేసరికి నాకు బిత్తరయిపోయింది.

మా నాయన బయంతో ఆవలించినాడు– కాళ్ల దాకా వచ్చిన సీటు పోయినట్టేనని ఖరారు చేసుకుంటా.

మా యిద్యానికేతన్‌లో ఇంగ్లీషు చెప్పే శశిప్రబ టీచరు వరసగా వాటీజ్ యువర్ నేమ్, ఫాదర్స్ నేమ్, మదర్స్ నేమ్, స్కూల్ నేమ్ అని అడుగతా పోతుందేగానీ ఇట్టాంటి కొసెను ఎప్పుడూ అడగలా. ఎవరిదైనా పేనా కిందపడిపోయి కనిపిస్తే దాన్ని పైకెత్తి పట్టుకొని 'హూజ్ పెన్ ఈజ్ దిస్' అని అడగాలని కూడా ఒకసారి చెప్పిందిగానీ ఇట్టాంటివి అడిగితే ఏమని చెప్పాలో ఎప్పుడూ చెప్పలా.

ఇదేందిరా దేవుడా అని నేను చేతులు కట్టుకొని సీలింగు వంకా ఫ్యాను వంకా చూస్తా ఉంటే 'ఒరే. నేను అడుగుతున్నది మీ నాయన ఏం పని చేస్తాడురా అని' అన్నాడు కుమారస్వామి ఐవోరు.

మనకు కొసెను అర్దమైపోయింది. ఇంక ఆన్సరు ఎంత?

'మై ఫాదర్ ఈజ్ కరెంట్ మాన్. ఎలక్ట్రిక్ మాన్. హి రిపేర్ మోటార్స్ ఫ్యాన్స్ అండ్ ఇస్త్రీ పెట్టేస్' అన్నాను.

ఆ మాటలకు ఆయన ముసిముసిగా నవ్వి 'ఊ. కరీంభాయ్. వీడు పనికొస్తాడయ్యా. రేపు తెచ్చి స్కూల్లో పడెయ్' అని ఇంకో మాట అక్కర లేకుండా లోపలకి వెళ్లిపోయాడు.

అది విని పోయిన ప్రాణం లేచొచ్చినట్టయ్యింది నాకు.

బతికినానురా తండ్రీ కుమారస్వామీ అనుకుంటా ఆ మరుసటి రోజు యశ్వోదయ హైస్కూలులో ఎనిమిదో కిలాసులో ధైర్యంగా అడుగుపెట్టినాను.

■